జాడలేని భూసార పరీక్షలు

- ఇప్పటి వరకూ ప్రారంభం కాని మట్టి సేకరణ - గతేడాది నమూనాల సేకరణకే పరిమితం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రైతులు వారి భూమి సారాన్ని తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించే భూసార పరీక్షలు జాడ లేకుండా పోయాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైపోయినా ఇప్పటి వరకూ మట్టి నమూనాలను సేకరించలేదు. గతేడాది నమూనాల సేకరణకే అధికారులు పరిమితమయ్యారు. బడ్జెట్ లేకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది..

రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే తొలుత వారి భూమి సారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా పొలానికి పోషకాలను అందిస్తేనే సాధ్యం అవుతుంది. ఇందు కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఐదేళ్లుగా ఈ భూసార పరీక్షల జాడ లేకుండా పోయింది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఈ భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఖరీఫ్ ప్రారంభమైనా ఇప్పటి వరకూ మట్టి నమూనాలను సేకరించలేదు. గతేడాది కేవలం మట్టి నమూనాల సేకరణ మాత్రమే చేశారు. ఆ నమూనాలను పరీక్షలు చేయడం పక్కన పెట్టేశారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో నాలుగు భూసార పరీక్షా కేంద్రాలు ఉండగా రెండు మాత్రమే పని చేస్తున్నారు. రెండు కేంద్రాలు ఏడాదికి పైగా పని చేయడం లేదు. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో భూసార పరీక్షా కేంద్రాలు మాత్రమే పని చేస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని నంద్యాల, డోన్ భూసార పరీక్షా కేంద్రాలు పనిచేయడం లేదు.

గతేడాది వేసవిలో నేల ఆరోగ్య పరిస్థితిపై పరీక్షలు నిర్వహించేందుకు కర్నూలు జిల్లాలో 10,252 మట్టి నమూనాలు, నంద్యాల జిల్లాలో 10,080 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యాలు నిర్దేశించారు. అందు కోసం వ్యవసాయ శాఖ ఎడిఎలు, ఎఓలు, విఎఎలకు శిక్షణ ఇచ్చారు. లక్ష్యం మేర సిబ్బంది మట్టి నమూనాలను సేకరించారు. నంద్యాల జిల్లాలోని 28 మండలాల నుంచి వచ్చిన నమూనాలను కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని భూసార పరీక్షా

కేంద్రానికి, కర్నూలు జిల్లాలోని 26 మండలాల నుంచి సేకరించిన నమూనాలను ఎమ్మిగనూరులోని భూసార పరీక్షా కేంద్రానికి పంపారు. భూసార పరీక్షా కేంద్రాల్లో మట్టి నమూనాలు పరీక్షించాలంటే రసాయనాలను బడ్జెట్ అవసరం అవుతుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద గతేడాది కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించలేదు. గతేడాది ఉమ్మడి జిల్లాలో సేకరించిన 20వేల మట్టి నమూనాలను పరీక్షించేందుకు దాదాపు రూ.30 లక్షల వరకూ ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాకు రూ.6.71 లక్షలు, నంద్యాల జిల్లాకు రూ.6.17 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గతేడాది సేకరించిన నమూనాల్లో కొన్నింటిని మాత్రమే పరీక్షించేందుకు వీలుటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. భూసార పరీక్షల నిర్వహణకు 10 మంది సిబ్బంది అవసరం ఉండగా ఇప్పటి వరకూ అందు కోసం సిబ్బందిని కేటాయించలేదు.

2024-25 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లాలో 19,500 మట్టి నమూనాలు, నంద్యాల జిల్లాలో 17,300 మట్టి నమూనాలను సేకరించాలని అధికారులు లక్ష్యం విధించారు. వాస్తవానికి ఏప్రిల్, మే నెలల్లో నమూనాలను సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకూ నమూనాల సేకరణ ప్రారంభం కాలేదు. జులై నెల వచ్చినా ఇప్పటి వరకూ మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించలేదు. దీంతో ఈ ఏడాది భూసార పరీక్షలు నిర్వహించడం సందేహంగానే కనిపిస్తోంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

డిఎస్‌సి ద్వారా 2,645 టీచర్ పోస్టుల భర్తీ

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో దాదాపుగా 2645 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ, సమగ్ర శిక్ష అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం 62 శాతం మాత్రమే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సంవత్సరం ప్రతి విద్యార్థి పాస్‌అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్టుమెంట్‌లో నియమించడం గాని,ట్యూటర్లను పెట్టడం గాని లేదా వర్చువల్ గా ఇక్కడి నుండే బోధన జరిగే విధంగా కానీ చర్యలు తీసుకోవాలని డిఇఒ శామ్యూల్‌ను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు డ్రాపౌట్‌లు కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. గత సంవత్సరం పదోతరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో రీఅడ్మిషన్ ఇచ్చి వారు ఉత్తీర్ణత అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం తగిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. కెజిబివి,ొంసిడెన్షియల్, మోడల్ స్కూల్, మోడల్ స్కూళ్లలో అడ్మిషన్ కావాలని మీకోసం, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చాలామంది దరఖాస్తులు ఇస్తున్నారన్నారు.. వీరందరికీ అడ్మిషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్ కోఆర్డినేటర్, సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు అందరూ సమావేశమై ఈ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, ఏదో ఒక స్కూల్లో అడ్మిషన్ ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్క విద్యార్థి కూడా పాఠశాల, వసతి గృహాల్లో సీటు దొరకలేదని బాధపడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, అసిస్టెంట్ డైరెక్టర్, పాల్ శామ్యూల్, సమగ్ర శిక్ష ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన పెన్షన్ రివిజన్ చేయాలి

- బిఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ పెన్షనర్ల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేసే రిటైర్డ్ అయిన పెన్షనర్లకు న్యాయమైన పెన్షన్ రివిజన్ చేయాలని బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జాయింట్ ఫోరంఆఫ్ బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ అసోసియేషన్ల పిలుపు మేరకు పెన్షన్ రివిజన్ వెంటనే చేయాలని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డిఒటి పెన్షనర్ల అసోసియేషన్ కర్నూలు జిల్లా శాఖ కర్నూలు బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం దగ్గర నిరసన ప్రదర్శన చేశారు. యాకోబు మాట్లాడుతూ వాస్తవానికి 2017 జనవరి 1 నుంచి నుండి పెన్షన్ రివిజన్ జరగవలసి ఉన్నదన్నారు. 2010 అక్టోబర్ 1కి ముందు టెలికాం డిపార్టుమెంటులో ఉద్యోగంలో చేరి బిఎస్ఎన్ఎల్‌లో అబ్సార్బ్ అయిన తరువాత రిటైర్ అయిన పెన్షనర్లకు పెన్షన్ సవరణ జరగాల్సి ఉందని, ఏడు సంవత్సరాల తర్వాత కూడా పెన్షన్ రివిజన్లో కేంద్ర ప్రభుత్వ వైఖరి మొండిగా ఉందన్నారు. కేంద్ర పెన్షనర్ల అసోసియేషన్ల పిలుపుమేరకు పలుమార్లు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు, పోస్ట్ కార్డు ద్వారా నిరసన తెలిపామన్నారు. సంబంధిత మంత్రులకు, ప్రధానమంత్రి కి, సంబంధిత అధికారులకు ఈమెయిల్ ద్వారాపై డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తెచ్చామన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమాలు జరిపి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్షలు చేపట్టామన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం న్యాయమైన పెన్షన్ రివిజన్ డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు.. పెన్షనర్లలో చాలామంది వృద్ధాప్య సమస్యలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెన్షన్ సవరణ సమస్యను సత్వరమే పరిష్కరించాలని అసోసియేషన్‌గా డిమాండ్ చేస్తున్నామన్నారు. తదుపరి బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోపై సమస్యను విజ్ఞాపన పత్రం ద్వారా సమర్పించి కేంద్ర మంత్రికి, టెలికాం డిపార్టుమెంట్ కార్యదర్శికి పంపాలని కోరామన్నారు. జిల్లా అధ్యక్షులు ఎ.రామలింగం, జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.మహేశ్వరరావు, జిల్లా కోశాధికారి ఖాజా మోదీన్, జిల్లా సహాయ కోశాధికారి షేక్ షబ్బీర్, సుంకన్న, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబు, రంగయ్య, వెంకటరామిరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, నాయకత్వం వహించారు. సభ్యులు విజయలక్ష్మి, శాంతి, అంజనీ బాయ్, ఫాతిమా ఖాతున్, వెంకటలక్ష్మి పాల్గొని నిరసన ప్రదర్శన జయప్రదం చేశారు.

నిరసన ప్రదర్శన చేపడుతున్న నాయకులు

పొదుపు ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి

- కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే గౌరుచరిత
- ఓర్వకల్లు ఐక్య సంఘం రజతోత్సవ వేడుకలు
- గౌరు చరితకు ఘన సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లులో సాగిన పొదుపు ఉద్యమం అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి పొందిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలం బాలభారతి పాఠశాల మైదానంలో ఓర్వకల్లు మండల పొదుపు లక్ష్మీఐక్య సంఘం రజతోత్సవ మహాసభ నిర్వహించారు. ఐక్య సంఘం గౌరవ అధ్యక్షులు విజయభారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ డిఆర్‌డిఎ పిడి సలీంబాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంట్లో ఎవరైనా మగవాళ్ళు చదువుకుంటే ఆ కుటుంబం ఉన్నతస్థాయికి వస్తుందని, అదే ఒక మహిళ చదువుకుంటే ఆ ఇల్లే కాదు సమాజంలో ఉన్న వాళ్లందరూ ఉన్నతులవుతారనే విషయాన్ని ఇక్కడున్న పొదుపులక్ష్మీ ఐక్యసంఘం మహిళలు చేసి చూపించారని పేర్కొన్నారు. 1995 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో స్వయం సహాయక సంఘాల గురించి ఒక ముఖ్యమైన ప్రశ్న ఉండేదని దాని జవాబు ఓర్వకల్లు మండలంగా గుర్తుపెట్టుకునే వాళ్లమని తెలిపారు. పేదరిక నిర్మూలన అన్నది ఇప్పటికీ, ఎప్పటికీ చాలా కష్టమైనపని అని, ఒకరికి ఆర్థికంగా సాయం చేయొచ్చు, చదువుపరంగా సాయం చేయొచ్చు కానీ వాళ్లని సొంత కాళ్ల మీద వాళ్లు నిలబడి వాళ్లంతకి వాళ్ళు ఇతరుల మీద ఆధారపడకుండా జీవించే పేదరికం నుంచి బయటకు తీసుకురావడం అన్నది అత్యంత కష్టమైన పని అన్నారు. అయినప్పటికీ మహిళలు ఇక్కడ మొదలుపెట్టిన ఉద్యమం ద్వారా ఇతరుల మీద ఆధారపడకుండా సొంత కాళ్ళ మీద జీవించి పేదరికం నుండి బయటకు రావచ్చునే విషయాన్ని మొత్తం ప్రపంచానికే ఇక్కడున్న మహిళలు తెలియచెప్పారన్నారు. మీరందరూ ఈరోజు విజయవంతమైన మహిళలు, గ్రూపులుగా ఉన్నారన్నారు. ఓర్వకల్లు మండలం పొదుపు ఐక్య సంఘానికి సంబంధించి ఇచ్చిన ప్రజెంటేషన్లో ఒక ప్రభుత్వం ఏం చేయగలదో లేదంటే ఒక ప్రభుత్వం నుండి ప్రజలు ఏం ఆశిస్తారో అవన్నీ కూడా మీ ఐక్య సంఘం వాళ్ళు చేసి చూపించారన్నారు. ఓర్వకల్లు మండలం పొదుపు ఐక్య సంఘానికి సంబంధించి ఇచ్చిన ప్రజెంటేషన్‌లో 2030 నాటికి పేదరికం అనేది లేని మండలంగా తయారు చేస్తామనే ప్రతిజ్ఞ మీరు చేసుకున్నారన్నారు. అందుకు అభినందనీయులన్నారు. ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ 1995లో డ్వాక్రా సంఘాలలో పొదుపు ఉద్యమం మొదలు పెట్టింది నారా చంద్రబాబునాయుడు అని తెలిపారు. ఓర్వకల్లు మండలం ఉండడం ఇప్పుడు ఓర్వకల్లు మండలం ఇంతకీ ఇంతింతై పెరిగి ఈరోజు ఈస్థాయిలో ఉన్నారంటే చాలా సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం అంటే ఓర్వకల్లు మండలం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. దీని వెనక ఓర్వకల్లు మండల పొదుపు లక్ష్మీ ఐక్య సంఘం అధ్యక్షురాలు విజయభారతి కృషి ఎంతో ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రాబోతుందని, అంతేకాకుండా ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు కూడా ఇవ్వబోతున్నారన్నారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు ఉన్న వాళ్లకు అందరికీ నెలకు రూ.1500 అంటే సంవత్సరానికి రూ.18,000 కూడా ఇవ్వబోతున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత కు ఘనంగా గజమాలతో పొదుపు మహిళలు సత్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి సలీంబాష, ఓర్వకల్లు మండల టిడిపి కన్వీనర్ గోవింద్ రెడ్డి, టిడిపి నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి విజయుడు, ఖాజమీయ్యా, శ్రీరాములు దితరులు పాల్గొన్నారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను గజమాలతో సన్మానిస్తున్న పొదుపు మహిళలు, అధికారులు

విస్తృతంగా సోడియం హైపోక్లోరైడ్ పిచికారి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరంలో విస్తృతంగా సోడియం హైపోక్లోరైడ్ పిచికారి చేస్తున్నామని కమిషనర్ ఏ.భార్గవ్ తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 1వ శానిటేషన్ డివిజన్ నుంచి పిచికారి ప్రారంభించామని, రెండు వారాల్లోపు నగరంలోని 16 డివిజన్లలో పిచికారీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ప్రతిరోజూ 5 వేల లీటర్లకు పైగా సోడియం హైపోక్లోరైడ్ రసాయనం అవసరం అవుతుందని, వాటిని రాష్ట్ర మంత్రివర్యులు టిజి.భరత్ అందిస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. పిచికారీకి ఆరు ట్రాక్టర్లు వినియేగిస్తున్నామని, అందులో రెండు ట్రాక్టర్లను కేసి కెనాల్‌లో పిచికారీకి వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో నగర పరిధిలో ఉన్న కేసి కెనాలంతా పిచికారీ పూర్తి అవుతుందని, అనంతరం వాటిని కూడా డివిజన్లకే కేటాయిస్తామని కమిషనర్ వెల్లడించారు.

కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న ప్రజాపరిరక్షణ సమితి బృందం

కలెక్టర్‌కు ప్రజాపరిరక్షణ సమితి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి రంజిత్‌బాషను సోమవారం ప్రజా పరిరక్షణ సమితిబృందం అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ధన్వంతరి చిత్రపటంతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు. కర్నూలు జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా చూడాలని కలెక్టర్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులుబలరాం గౌరవ అధ్యక్షుడు పద్మానందయోగీ, డేవిడ్ , శ్రీరాములు, చంద్ర, రవికుమార్, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ మాధురి, బ్రహ్మం, న్యాయవాదులు నరసింహ, చంద్రశేఖర్, కవి భైరవ,రాయలసీమ రవి కుమార్, అశోక్, కల్లూరు వెంకటేశ్వర్లు, చంద్ర, టీజీ శీను, సురేష్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

4న విద్యాసంస్థల బంద్

పోస్టర్‌ను విడుదల చేసిన విద్యార్థిసంఘాల నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నీట్ ,యుజిసి నెట్ పరీక్షల పేపర్లు లీక్‌ను నిరసిస్తూ ఈనెల4న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ చేపడుతున్నట్లు విద్యార్థి సంఘాల నేతలు వెల్లడించారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్ ఆవరణలో మీడియా పాయింట్ దగ్గర పోస్టర్లను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడారు. నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీపై సిట్టింగ్ సుప్రీం కోర్ట్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లు విడుదల చేశామన్నారు. మోడీ 3.0 ప్రభుత్వం అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అన్నారు. నీట్ పరీక్షల్లో 720 మార్కులకు 720 మార్కులను 67 మంది సాధించినట్లు రావడం, హర్యానాలోని ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురికి 720 మార్కులు రావడం, ఒక ప్రశ్నకు కరెక్ట్ అయితే నాలుగు మార్కులు, రాంగ్ అయితే ఒక నెగిటివ్ మార్కు ఉంటుందన్నారు. ఈ లెక్కలో 719 లేదా 718 మార్కులు రావడానికి అవకాశం లేదన్నారు. నీట్ పరీక్షల్లో 719 , 718 మార్కులు వచ్చాయన్నారు. పరీక్షకు సమయం తక్కువగా ఉందనే కారణంతో 1564 మందికి గ్రేస్ మార్కులు కలిపారన్నారు. సమయం ఎవరికి తక్కువ ఉంది ఎవరికి ఎక్కువ ఉంది అనేది నిర్ధారించే పరిస్థితి ఎన్‌టిఎకు లేదన్నారు. కొంతమందికి సమయం తక్కువ ఉన్నా మార్కులు కలపలేదన్నారు. కొంతమందికి సమయం కరెక్టుగా ఉన్న కలిపారనే ఆరోపణ రావడంతో సుప్రీంకోర్టు స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేస్తే అప్పుడు కేంద్ర ప్రభుత్వం గ్రేస్ మార్కులతో లబ్ధి పొందిన 1564 మంది మళ్లీ పరీక్ష రాసిన వాళ్లలో ఏ ఒక్కరికి టాప్ ర్యాంకు రాలేదన్నారు. దాంతో నీట్ పేపర్లు లీక్ అయ్యాయని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. మొత్తం వ్యవహారంలో బీహార్ ,హర్యానా, గుజరాత్ రాష్ట్రాల్లో పేపర్ లీక్ అయినట్లు ఇప్పటికే పోలీసులు నిర్ధారించారన్నారు. పేపర్ లీక్ చేసిన ఎన్‌టిఎ సిబ్బంది కూడా నిర్ధారణలో ఒప్పుకున్నట్లు తెలుస్తుందన్నారు. 24 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్న నీట్ పరీక్షల్లో ఇలాంటి అవినీతి అక్రమాలు జరగడం పై నరేంద్ర మోడీ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. నీట్ నెట్ లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ను తిరిగి నిర్వహించాలని కోరారు. పరీక్షల్లో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలపై విశ్వానీయతను దెబ్బతీసేలాగా ఈ స్కాములు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి పార్టీలు కూడా నీట్ నెట్ పేపర్ లీకేజీలపై స్పందించాలని వారు కోరారు. ఈనెల 4న జరిగే బందులో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం, మేధావులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, ఎఐఎస్ఎఫ్ నగర నాయకులు శరత్ ,అశోక్ పిడిఎస్‌యు నాయకులు రమణ, దామోదర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

ఎమ్మెల్యే హెల్ప్ లైన్ పుస్తకం ఏర్పాటు : కెఇ శ్యామ్ కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఎమ్మెల్యే హెల్ప్‌లైన్ పుస్తకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ అన్నారు. మంగళవారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాలలోని ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే ఆ సమస్యలను నేరుగా పత్తికొండ టిడిపి కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే హెల్ప్‌లైన్ పుస్తకంలో నమోదు చేయాలని అన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉంటే ఆ సమస్య తమ పేరును మొబైల్ నెంబర్ రాసిపోతే ఆ సమస్య పరిష్కారం చేసి ఫోన్ ద్వారా మీ సమస్య పరిష్కారమైందని వారికి తెలుపుతామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పెన్షన్లు, హౌసింగ్, రేషన్ కార్డ్స్, ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్ షిప్పు వంటివి మేము ఇప్పిస్తామని గ్రామాలలో ఎవరైనా నాయకులు, కార్యకర్తలకు డబ్బులు వసూలు చేస్తే వారి తాట తీస్తానని హెచ్చరించారు. ఇవే కాక ఏవైనా సమస్య మేము పరిష్కారం చేస్తాం మాకు డబ్బులు ఇవ్వండని ఎవరైనా అడిగినా, ఎమ్మెల్యే పేరు చెప్పి డబ్బులు అడిగితే వారు నేరుగా టిడిపి కార్యాలయానికి వచ్చి ఈ పుస్తకం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, టిడిపి నాయకులు ప్రమోద్‌రెడ్డి, పెరవలి పురుషోత్తం చౌదరి, హుల్తెన్న, వాకిటి శ్రీనివాసులు, కడవల సుధాకర్, ఆంజనేయులు, తిరుపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతన్న కెఇ.శ్యాంకుమార్

నర్సుశాంతమ్మకు సన్మానం చేస్తున్న వైద్య సిబ్బంది

పిహెచ్‌ఎన్‌కు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి-తుగ్గలి

మండల పరిధిలోని పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పబ్లిక్ హెల్త్‌నర్స్‌గా పని చేస్తున్న శాంతమ్మ ఉద్యోగ విరమణ చేయడంతో ఆమెను వైద్యాధికారిని డాక్టర్ హరిత ,వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యధికారిని డాక్టర్ హరిత మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన శాంతమ్మ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఎన్నో వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారన్నారు.సూపర్వైజర్ బండయ్య, యుడిసి పరమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిఐ కాలేజీలలో రెండో విడత ప్రవేశానికి ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ , ప్రైవేటు ఐటిఐలలో ప్రవేశానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఆసక్తి కలిగిన విద్యార్థిని, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా websiteiti.ap.gov.inలో ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టెన్త్‌పాసైన, ఇంటర్, డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అభ్యర్థులు అర్హులు. దరఖాస్తుకు ఆఖరు తేది. 24-07-2024. మహిళా అభ్యర్థులకు ప్రతి ట్రేడ్ లో 33 శాతం రిజర్వేషన్ ఉన్నాయి. పూర్తి వివరాలకు సమీప ఐటిఐలలో సంప్రదించాలని రాష్ట్ర జనరల్ సెక్రటరీ దామోదర చౌదరి , జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

వెల్దుర్తి మండలం పుల్లగుమ్మిలో గ్యాస్‌సిలిండ్‌పేలి కూలిన మట్టిమిద్దె

గ్యాస్ సిలిండర్ పేలి కూలిన మట్టిమిద్దె

ప్రజాశక్తి-వెల్దుర్తి : వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి సామన్నకు చెందిన మట్టి మిద్దెపై కప్పుతో సహా పడిపోయింది. పేలుడు శబ్దానికి గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇంట్లో మనుషులు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణహానీ జరగలేదు. ఇంట్లోని ధాన్యం, బట్టలు, వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటనతో తాము నిరాశ్రయులయ్యామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

నిబద్ధతతో విధులు నిర్వహించండి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ప్రలోభాలకు గురికాకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో కమిషనర్ రామచంద్ర రెడ్డి అధ్యక్షతన ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణాభివృద్ధికి అవసరమైన వాతావరణాన్ని నెలకొల్పడానికి ప్లానింగ్ సెక్రటరీ కలిసికట్టుగా విధులు నిర్వహించాలని సూచించారు. అక్రమ కట్టడాల విషయంలో ఉపేక్షించకుండా చట్టప్రకారం ముందుకు పోవాలని తెలిపారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆదోని అభివృద్ధిని ఆకాంక్షించే దిశగా ఆర్థిక వనరులు సమకూర్చుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ నాయక్, వివిధ సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

మాట్లాడుతున్న సత్యవతి

ప్రజాశక్తి -దేవనకొండ

సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదోని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, చికున్ గున్యా, మెదడు వాపు, ఫైలేరియా గురించి పిహెచ్‌సి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు మాట్లాడారు. జులై మాసంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని, దాని ప్రభావం వలన వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఆశాలు ఇంటింటికి తిరిగి దోమలకు సంబంధించిన లార్వాలను నివారించాలని చెప్పారు. డాక్టర్లు విజయ్ కుమార్, కల్యాణ్, సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రంగస్వామి, జయలక్ష్మి, హనుమంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వంట ఏజెన్సీ

మధ్యాహ్న భోజనం ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన వంట ఏజెన్సీ ఆధ్వర్యంలో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. టిడిపి నాయకులు, మాజీ సర్పంచి రహమతుల్లా, మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, బేతాళ బడే సాహెబ్, తిరుపతయ్య నాయుడు మంగళవారం ప్రారంభించి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన వంట ఏజెన్సీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. భారతం రహమతుల్లా, ఎస్.షేక్షావలీ, పూజారి చంద్ర, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, బాబునాయుడు, జనసేన బాష, మాలిక్, కోటేకల్ రఫీ, రాంపురం రఫీ, బి.రమేష్ నాయుడు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న నాయకులు

నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ

4న దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈనెల 4న చేపట్టే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఆదోనిలోని విద్యార్థి జెఎసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి దసగిరి, పిడియుఎస్ జిల్లా అధ్యక్షులు అఖండ, కోశాధికారి సోమశేఖర్, జిల్లా కన్వీనర్ తిరుమలేష్, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఆర్‌పిఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బాలు మాట్లాడారు. 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్' ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిందని తెలిపారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో జరిగిన నెట్ పీజీ పరీక్షకు బాధ్యత వహించి వాయిదా వేసిందని తెలిపారు. నీట్ యుజిసి నెట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్‌టిఎ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు గౌస్, నాయకులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర నాయుడు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర, పిడిఎస్ఒ జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర, పిఎస్‌యు జిల్లా కార్యదర్శి సురేష్, ఎఐఎస్ఎ పట్టణ కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, ప్రమోద్, పిడిఎస్‌యు పట్టణ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. **దేవనకొండ**లోని అన్ని ప్రయివేట్, ప్రభుత్వ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులను విద్యార్థి సంఘాల నాయకులు కలిశారు. బంద్‌కు సంబంధించిన విషయాన్ని తెలిపారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవితేజ, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, మధు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు, డివైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చిన్న వీరేందర్ నాయుడు, విద్యార్థి సంఘాల నాయకులు విష్ణువర్ధన్, మల్లికార్జున, రాజు, నాని, పులి రాజు, అశోక్, అచ్యుత్, యుజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆదోనిలో అభివాదం చేస్తున్న నాయకులు

దేవనకొండలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

చేయూత పెండింగ్ నిధులివ్వాలి

- ఎంపిడిఒ కార్యాలయం ఎదుట మహిళల ధర్నా

ప్రజాశక్తి - దేవనకొండ

చేయూత పెండింగ్ నిధులు ఇవ్వాలని మహిళలు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా మహిళలకు ఇచ్చే చేయూత నిధులు తమకు రాలేదంటూ దేవనకొండకు చెందిన మహిళలు మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మాజీ ఎంపిటిసి సభ్యులు ఎమ్.నరసారావు, సిపిఐ నాయకులు కండప్ప, అశ్వద్ధామ, భాస్కర్, మధులు మద్దతు తెలిపి మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రస్తుత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ఎవరైతే అర్హులు ఉన్నారో వారి ఖాతాల్లో చేయూత నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇఒఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ రుబికకు వినతిపత్రం అందజేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. చేయూత నిధులు పడని లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మహిళలు

ఘనంగా బీవీ కుమార్తె పుట్టినరోజు వేడుకలు

- పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి కుమార్తె బీవీ.యుభాషణ రెడ్డి పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని వేడుకలు చేసుకున్నారు. అనంతరం మేజర్ పంచాయతీలో పనిచేసే మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, రామాంజనేయులు, బేతాళబడేసా, తిరుపతయ్య నాయుడు, షేక్షావలీ, పూజారి చంద్ర, నూర్ అహ్మద్, ఫక్రుద్దీన్, రమేష్ నాయుడు, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, చిన్ననేలటూరు నాగన్న, గాజులదిన్నె చంద్ర పాల్గొన్నారు.

కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

'ప్రజలకు సేవలు అందించాలి'

ప్రజాశక్తి - కౌతాళం

ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలని మాజీ ఎంపిటిసి కురుగోడు కోరారు. మంగళవారం ఉరుకుందలో నూతన చౌక దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ప్రజలకు నిత్యావసర సరుకులు అందించేందుకు ఈ దుకాణాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మంచి సరుకులను అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కావలి ఈరప్ప, హుసేని, ఈరప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

డాక్టర్ మైత్రిపై విచారణ

- శిశువు తల్లిదండ్రుల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రిపై ఫిర్యాదులు రావడంపై మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వాస్పత్రిలో జూన్ 23న చోటు చేసుకున్న శిశువు మృతి సంఘటనపై సూపరింటెండెంట్ మైత్రిపై డిసిహెచ్ డాక్టర్ మాధవి ప్రభుత్వాస్పత్రిలో విచారణ చేపట్టారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ నిర్లక్ష్యం వల్ల శిశువు మృతి చెందడంపై తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిసిహెచ్ డాక్టర్ మాధవి విచారణ చేపట్టారు. అనంతరం డాక్టర్ మాధవి మాట్లాడారు. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన ఎస్.ఖాదర్ బాషా భార్య ఎస్.అక్తర్ బేగమ్‌కు సిజేరియన్ చేసి శిశువును బయటకు తీశారని తెలిపారు. శిశువు ఆరోగ్య స్థితిగతులు సరిగ్గా లేక మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయంపై ఆస్పత్రిలో విచారణ చేపట్టామన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూపరింటెండెంట్ సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం వహించడం కారణంగా ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్న ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాన్పుల కేసులో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై కాన్పు వార్డులో విచారించగా ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని తేల్చిచెప్పారన్నారు. శిశువు మృతిపై ఎలాంటి సంబంధమూ లేదని సూపరింటెండెంట్ వాంగ్మూలంగా ఇచ్చారన్నారు.

విచారణ చేస్తున్న విచారణ అధికారి డాక్టర్ మాధవి

విచారణ చేపడుతున్న ఎస్ఐ గోపినాథ్

వంట ఏజెన్సీ నిర్వాహకుల ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మేకల రాఘవేంద్రమ్మ, దాసప్ప గారి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపినాథ్ విచారణ చేపట్టారు. మంగళవారం ఆయన పాత పాఠశాల భవనం వద్ద వంట చేస్తున్న వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సోమవారం వంట ఏజెన్సీ నిర్వహణ విషయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపుల మధ్య తగాదా జరిగిందని తెలిపారు. దీనికంటే ముందే వచ్చి తిక్కారెడ్డి గ్రూపు విజయరామిరెడ్డి, గణేకంటి రామకృష్ణ, వనికె నాగరాజు, గనేకంటి రఘు తదితరులు వంట గది వద్దకొచ్చి ఏజెన్సీ తమదే అంటూ నానా దుర్భాషలతో వంట సామగ్రిని బయట పడేశారని చెప్పారు. ఈ విషయాలు ఫిర్యాదులో పేర్కొనగా విచారణ చేపట్టామని తెలిపారు.

ప్రయివేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

- డిఎంహెచ్ఒకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

ప్రయివేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులను నియంత్రించాలని కోరుతూ డివైఎఫ్ఐ నాయకులు కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆదోనిలో డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నాగేష్, జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, హుస్సేన్ బాష మాట్లాడారు. పట్టణంలో ఆరోగ్యశ్రీ పేరుతో వైద్యం అందిస్తున్న మధు, వంశీ చైతన్య ప్రయివేట్ నర్సింగ్ హోమ్స్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం నుంచి బిల్లు తీసుకుంటూ రోగుల నుంచి అదనంగా వైద్యం, వైద్య పరీక్షల పేరుతో వేలాది రుపాయలు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి నర్సింగ్ హోమ్‌లపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, క్లినిక్ అనుమతులతో నర్సింగ్ హోమ్ తరహాలో వైద్యం అందిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టిబి, అతిసార వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- డాక్టర్ అనిల్ సాగర్

ప్రజాశక్తి - ఆదోని

టిబి, అతిసార వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఒ డాక్టర్ అనిల్ సాగర్ సూచించారు. మంగళవారం ఆదోనిలోని హనుమాన్ నగర్ యుపిహెచ్‌సి ప్రాంతంలో ఎంపిహెచ్ఎస్ బాబు రాజు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ సాగర్ మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గళ్ల పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. టిబి వ్యాధి నిర్ధారణ అయితే ప్రతి నెలా రూ.500 ఇస్తారన్నారు. పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అర్బన్ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన విరుపాక్షి స్వామి

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన విరుపాక్షి స్వామి

ప్రజాశక్తి - ఆదోని

రెండు రాష్ట్రాల ఉమ్మడి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని మంగళవారం అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలో కలిసినట్లు నిరంతర సేవకుడు, జనసేవ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు విరుపాక్షి స్వామి చరవాణి ద్వారా తెలిపారు. గత 10 సంవత్సరాలుగా ఆదోని పట్టణంలోనే కాకుండా జాతీయస్థాయిలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి స్వయంగా 23 సార్లు రక్తదానం చేసినట్లు వెల్లడించారు. వేలాది మందితో రక్తదానం చేయిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా గత పది సంవత్సరాల నుంచి నిస్వార్థంగా ఆయన అందిస్తున్న సేవలు అమోఘమని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

కోగిలతోట వాంతులు, విరోచనాలు

- అధికారులూ.. స్పందించండి : గ్రామస్తులు

ప్రజాశక్తి - హోళగుంద

మండలం కోగిలతోట గ్రామంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం గ్రామస్తులు మాట్లాడుతూ... దీనికి కారణమేంటి, వాతావరణ కాలుష్యమా, లేక తాగునీటి కాలుష్యమా అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. ఇటీవల తాగునీరు స్టాక్ చేసే ట్యాంకర్‌ను శుభ్రం చేసినా విద్యార్థులకు వాంతులు, విరోచనాలు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. మరి టాంకర్‌లో ఉన్న నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని తెలిపారు. ఇప్పటికే స్థానిక ఎస్సీ కాలనీలో ఐదు, ఆరుగురు పిల్లలు నీళ్ల విరోచనాలు, వాంతులతో బాధపడుతున్నారని చెప్పారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న పేదలు డాక్టర్ల దగ్గరకు వెళ్లి రూ.వేలకు వేలు ఫీజులు చెల్లాల్సిందేనా అని నిలదీశారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఉందని కోరారు.

రెండు మార్కెట్లకు ముగిసిన వేలం పాటలు

- బస్టాండ్ వేలం వాయిదా

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు పంచాయతీ పరిధిలోని వివిధ మార్కెట్లకు మంగళవారం సర్పంచి అరుణ దేవి అధ్యక్షతన బహిరంగ వేలం పాటలు ఇఒఆర్‌డి ప్రకాష్ నాయుడు నిర్వహించారు. ప్రతేడాది వేలం పాటలు నిర్వహించి ఏడాదిపాటు కాలపరిమితి నిర్ణయించేవారు. ఈసారి మాత్రం 9 నెలలకు మాత్రమే కాలపరిమితి విధించడంతో వేలం పాటలో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దినసరి కూరగాయల మార్కెట్‌ను రూ.2.63 లక్షలకు వెంకటలక్ష్మి దక్కించుకున్నారు. అలాగే సంత మార్కెట్‌ను రూ.2.11 లక్షలకు నాగరాజు దక్కించుకున్నారు. బస్టాండ్ ప సర్కార్ వారి పాట రూ.3.50 లక్షలు నిర్ణయించగా ఎవరూ ముందుకు రాకపోవడంతో బస్టాండ్‌కు సంబంధించిన వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా పంచాయతీ అధికారి అనుమతితో మరోసారి వేలం పాట నిర్వహిస్తామని, అలాగే పంచాయతీకి ఆదాయం చేకూరే విధంగా చూస్తామని ఇఒఆర్‌డి ప్రకాష్ నాయుడు తెలిపారు.

వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

కలిసికట్టుగానే ముందుకు

- ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి సమిష్టిగానే ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. మంగళవారం వ్యాపారవేత్త విట్టా రమేష్ స్వగృహంలో కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలన పరమైన విషయాల్లో ఎమ్మెల్యే పార్థసారథికి పూర్తి స్వేచ్ఛ ఇస్తూ సహకరిస్తామని తెలిపారు. ఎలాంటి విభేదాలూ లేవని, ఎవరి పార్టీ అభివృద్ధికి వారు కృషి చేసుకోవచ్చని తీర్మానించామన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, శ్రీకాంత్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, రాజశేఖర్, చంద్రశేఖర్, రామచంద్ర, సావిత్రి, రామస్వామి, దేవేంద్రప్ప, నాగ రాజు, శ్రీనివాస్ ఆచారి, ఉపేంద్ర ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న చిరంజీవి

జన సైనికునికి నివాళి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని కుందనగుర్తి గ్రామానికి చెందిన జనసేన పార్టీకి చెందిన కార్యకర్త రఫీమ్ (36)కు బ్రెయిన్ సర్జరీ చేస్తూ ఉండగా అకాల మరణం చెందారు. తన చిన్ననాటి స్నేహితుడు మరణ వార్తను తెలుసుకున్న జనసేన పార్టీ మండల కన్వీనర్ చిరంజీవి కుందనగుర్తి గ్రామానికి వెళ్లి రఫీమ్ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చిరంజీవి మాట్లాడుతూ... బాధిత కుటుంబానికి భవిష్యత్తులో జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. జనసేన పార్టీ కార్యకర్తలు హనుమేష్, జిఎస్.రాజు, శివకుమార్, మహేష్, పవన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా సీతాలదేవి పండగ

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని నెరణికి తండా గ్రామంలో సీతాల దేవి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతేడాది లాగే ఈసారి కూడా గ్రామస్తులంతా కలిసిమెలిసి పండగను జరుపుకున్నారు. సీతాల దేవికి ప్రత్యేకంగా పూజలు చేశారు. సకాలంలో వర్షం కురవాలని, పంటలు బాగా పండాలని పూజలు చేశారు. గ్రామ పెద్దలు హీర్య నాయక్, విజయ నాయక్, పంపా నాయక్, నర్స నాయక్, వినోద్ నాయక్ పాల్గొన్నారు.

ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు

ప్రజాశక్తి - మంత్రాలయం

టొరంటో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎముకల సాంద్రత ఉచిత పరీక్షలను 145 మంది సద్వినియోగం చేసుకున్నట్లు ఆ సంస్థ మెడికల్ రెంప్రజెంటేటివ్ వి.మల్లేష్ తెలిపారు. మంగళవారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలోని భాస్కర్ ప్రాథమిక చికిత్స కేంద్రం నిర్వాహకులు డాక్టర్ భాస్కర్ ఆహ్వానం మేరకు పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా ఆదోని పట్టణంలోని టొరంటో ఫార్మా కంపెనీ పరీక్షలు చేపట్టిందని తెలిపారు. సాధారణంగా ప్రతి ఒక్కరికీ వయస్సును అనుసరించి ఎముకల్లో క్యాల్షియం శాతం సాధారణంగా ఉంటే ఎముకలు బలంగా ఉంటాయని తెలిపారు. తక్కువ ఉన్న వారు డాక్టర్ల సలహా మేరకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ భాస్కర్, టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీమఠంలో నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. మంగళవారం ఏకాదశి తిథి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చనతో, కాషాయ వస్త్రాలతో, తులసి మాలతో అందంగా అలంకరించారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి మంగళ హారతులు ఇచ్చారు. ఏకాదశి తిథి కావడం వల్ల స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం, పరిమళ ప్రసాద విక్రయం నిలిపివేయడం కొనసాగుతున్న సాంప్రదాయం.

పేదల కళ్లలో ఆనందం చూడడమే లక్ష్యం

- తెలుగు రైతు కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు ఆదిశేషిరెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పేదల కళ్లలో ఆనందం చూడడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని తెలుగు రైతు కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు ఆదిశేషిరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచే విస్తృతంగా పర్యటించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. పింఛన్ల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.819 కోట్ల భారం పడుతున్నా ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. గతంలో జగన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ స్కీములన్నీ స్కాములుగా మారాయని తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు సిద్ధు పాల్గొన్నారు.

పింఛను పంపిణీ చేస్తున్న నాయకులు

నిందితులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం రత్నపల్లెలో దళిత మహిళ హనుమక్కపై దాడి చేసిన ఆధిపత్య వర్గాలపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. మంగళవారం కౌతాళం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు తాయప్ప, వీరేష్, మారయ్య మాట్లాడారు. దళిత మహిళ హనుమక్క గత 30 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూమిపై ఆధిపత్య వర్గాల కన్నుపడిందని తెలిపారు. ఆమెను భూమి నుంచి తప్పించాలని ఆమె వేసిన పంటను చెరిపేసి, ఆధిపత్యం వర్గాలు పంట వేస్తుండగా హనుమక్క పోయి అడ్డుకోవడంతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశారని తెలిపారు. కొట్టి గాయపరిచి, ఆమెను చిత్రహింసలకు గురి చేయడం తగదన్నారు. ఆమె ఫిర్యాదు చేసినా వెల్దుర్తి పోలీసులు వారిపై కేసు పెట్టకపోగా హనుమక్కను భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదన్నారు. హనుమక్కపై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి భూమి హనుమక్కకు దక్కేటట్లు చేయాలని కోరారు. వీరన్న, దావీదు, ఈరప్ప పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) ADONI.
H.M.O.P No 13 of 2023
(In The Matter of hindu Marriage act,1955)

Between
K.Subramanyam Achari. ...Petitioner
AND
K.Veereshamma. ...Respondent

To,
1. K.Veereshamma
W/o.K.Veereshamma aged about 34 years Cultivator resident of Nagalapuram Village of Adoni Mandal.

Madam,

Whereas the above named petitioner filed a petitionagainstthe Respondent for (Specify the relief). The above matter hasposted to 04.07.2024. As such you are hereby summonedtoappear before this Hon'ble court either in person or throughpleader to answer all material questions relating totheabovecase in the event of failure to appear before the Hon'bleCourton 04.07.2024 @ 10 : 00 AM you will be treated Ex –Parteandfurther directed to fill statement and to produced all documentson which relive.

HAJI.A.RAZAAHMED
Advocate for Petitioner.